క్లుప్తంగా

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు



ఎమ్మెల్సీతో కాట్రియాల తండావాసులు

రామాయంపేట(మెదక్):మండలంలోని కాట్రియాల తండాలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి రూ. పది లక్షలు మంజూరు చేశారు. ఈమేరకు తండావాసులు శనివారం ఎమ్మెల్సీని కలువగా, నిధుల మంజూరు పత్రాన్ని ఆయన తండావాసులకు అందజేశారు. కార్యక్రమంలో దామరచెరువు సర్పంచ్ శివప్రసాదరావు, బీఆర్ఎస్ నాయకులు పుట్టి అక్షయ్, నాయకులు చందర్‌నాయక్, సర్దార్, పోమ్యా, దేవీసింగ్, బాలూ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

అంజన్నకు పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, మన్యసూక్త పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు దేవదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న భిక్షపతి

అల్లాదుర్గం(మెదక్): బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటామని టీఎస్‌టీపీసీ చైర్మన్ మఠం భిక్షపతి అన్నారు. మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త పోచయ్య కరెంట్ ప్రమాదంలో మృతి చెందారు. శనివారం ఆయన కుటుంబాన్ని భిక్షపతి పరామర్శించారు. పేద కుటుంబం కావడంతో రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

సన్మానం

రామాయంపేట(మెదక్): మాజీ ఎమ్మెల్యే శశీధర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దామోదర రాజానర్సింహ్మ, మధుయాస్కీలను శనివారం కలిసి వారిని సన్మానించారు. ఈమేరకు వారిని హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కలిసినట్లు శశీధర్‌రెడ్డి తెలిపారు. ఆయనవెంట పార్టీ నాయకులున్నారు.

కూలిన ఇళ్లు

శివ్వంపేట(నర్సాపూర్): పది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు శిథిలావస్థకు చేరిన ఇళ్లు కూలిపోయాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు మండలంలోని పలు గ్రామాల్లో నివాస ఇళ్లు కూలిపోయాయి. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 65 ఇళ్లు పాక్షికంగా, 6 ఇళ్లు పూర్తిగా కూలిపోయినట్లు రెవెన్యూ సిబ్బంది చెప్పారు.

బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

నర్సాపూర్: వర్షాలతో ఇబ్బందులకు గురైన ప్రజలను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయిందని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ ఆరోపించారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ... సుమారు పది రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అల్లాడుతున్నా.. బీఆర్ఎస్ ప్రభుత్వం సరిగా స్పందించలేదని ఆరోపించారు. అధికార బీఆర్ఎస్ నాయకులు చెరువులు, కుంటలను కబ్జా చేయడంతో పలు పట్టణాల్లో వర్షపు నీరు కాలనీలు, అపార్ట్‌మెంట్లలోకి వచ్చిందన్నారు. వర్షాలతో ప్రాణ నష్టంతో పాటు పంట నష్టం, పశు సంపద నష్టాలను అంచనా వేసి అన్ని వర్గాలను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు.

కార్మికులను పట్టించుకోని సర్కార్



మనోహరాబాద్‌లో నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

మనోహరాబాద్(తూప్రాన్): పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా వారు ఉరి వేసుకొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ కార్మికుల సంఘం కార్యదర్శి ఆసిఫ్, మండల పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె శనివారం 24వ రోజు కొనసాగింది.

అధ్వానంగా బీటీరోడ్లు

ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారు కావడంతో ప్రయాణికులు, వాహనదారుల ఒళ్లు హూనమవుతోంది. పెద్ద చెరువు కట్టపై బీటీ రోడ్డు పాడైపోవడంతో పలు గ్రామస్తులకు దూరభారం పెరుగుతోంది. పోతులబోగూడ నుంచి అనంతరం చౌరస్తా వరకు రోడ్డు గుంతలమయమైంది. ఇదీ శివ్వంపేటలోని పరిస్థితి. రద్దీగా వాహన రాకపోకలు సాగించే మండల కేంద్రం శివ్వంపేట నుంచి పెద్ద చెరువు కట్టపై బీటీ రోడ్డు పాడైపోయింది. ఈ రోడ్డు గుండానే సిల్లుట్ల, రత్నపూర్, కొత్తపేట, అల్లీపూర్‌తోపాటు పలు గిరిజన తండాలతో పాటు ఇతర మండలాలకు వెళ్లే ఆస్కారం ఉంది. అలాగే పోతులబోగూడ నుంచి ఉసిరికపల్లి చౌరస్తా, చండి నుంచి అనంతరం చౌరస్తా (లచ్చిరెడ్డిగూడెం, నవాబుపేట, పబండ గ్రామాలు) వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసమై నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరైనా, కానీ టెండరుకు నోచలేదు. కాగా శివ్వంపేట నుంచి ఎదుల్లాపూర్, కొత్తపేట చౌరస్తా నుంచి కొడిపల్లి మండలానికి వెళ్లే అంతర్గత రోడ్డు సైతం ఆగమాగమైంది. మరిన్ని రోడ్లు సైతం దెబ్బతిని ప్రయాణం ప్రమాదభరితంగా మారింది.



గుంతలమయంగా ఉసిరికపల్లి - పోతులబోగూడ రోడ్డు

ఈ రోడ్డులో బస్సులు సైతం రద్దు

ముఖ్యంగా పోతులబోగూడ నుంచి అనంతరం చౌరస్తా వరకు రోడ్డు గుంతల మయంగా ఉండడంతో ఆర్‌టీసీ బస్సులు సైతం రద్దయ్యాయి. దెబ్బతిన్న రోడ్డుతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా రాత్రివేళల్లో బైకులు అదుపు తప్పి పడిన సంఘటనలు అనేకం చోటుచేసుకున్నాయని పలువురు గ్రామస్తులు ఆరోపించారు. పాడైపోయిన గ్రామీణ రోడ్లతో గ్రామ యువకులకు పిల్లనిచ్చేందుకు ముందుకు రావడం లేదని వారు వాపోతున్నారు. అలాగే రోడ్డు పాడైపోవడంతో ఇతర మార్గాల గుండా దూరభారంగా వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



శివ్వంపేట చెరువు కట్టపై బీటీ రోడ్డు

నా భర్త ప్రాణం పోయింది

గుంతల రోడ్డు వల్ల నా భర్త ప్రభాకర్‌చారి ప్రాణం పోయింది. సంవత్సరం క్రితం పని నిమిత్తం టీవీఎస్ ఎక్సల్‌పై గుమ్మడిదలకు వెళ్లి, తిరిగి గ్రామానికి వస్తున్న క్రమంలో గుంతల రోడ్డుపై అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో టీవీఎస్ ఎక్సల్ పెట్రోల్ ట్యాంక్ మూత ఉడిపోవడంతో మంటలు చెలరేగి అగ్నికి అహుతి అయ్యారు. మా కుటుంబానికి తీరని బాధ మిగిల్చింది. ఇలాంటి సంఘటన మరో కుటుంబంలో జరుగకుండా రోడ్డు బాగు చేయాలి. – సరిత, బాధితురాలు, నవాబుపేట



ప్రతిపాదనలు పంపించాం

మండలంలో దెబ్బతిన్న పీఆర్ రోడ్ల మరమ్మతుల కోసం ఉన్నత అధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం.
– భాస్కర్‌రావు, పీఆర్, ఏఈ

పెద్దచెరువు వద్ద ఎమ్మెల్యే పూజలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లి పెద్దచెరువు మినీట్యాంక్‌బండ్‌లో శనివారం నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులో జలకళ సంతరించుకుంది. దీంతో చెరువు పరిసరాలను పరిశీలించి బతుకమ్మగాట్ వద్ద పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో రైతులు సంతోషంగా ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం రైతుల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. అర్హులందరికీ డబుల్‌బెడ్రూం ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ చిన్న చిన్నంరెడ్డి, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మల్లేశం, నాయకులు నర్సాపూర్ కౌన్సిలర్ అశోక్‌గౌడ్, శివ్వంపేట మాజీ సర్పంచ్ నవీన్ గుప్తా, నాయకులు నవీన్‌రావు, పిస్కె శెట్టయ్య, లక్ష్మణ్, పాండు, దుర్గేశ్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

సామాన్యులు భయపడొద్దు..

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామాల్లో ఆకస్మాత్తుగా నిర్వహిస్తున్న కార్డెన్ సెర్చ్‌కు సామాన్యులు భయపడాల్సిన అవసరం లేదని, కార్డెన్ సెర్చ్ అంటే కేవలం నేరస్తులు మాత్రమే అనుమానస్పదంగా వ్యవహరిస్తారని నర్సాపూర్ సీఐ షేక్‌లాల్ మధార్ అన్నారు. శనివారం మండల కేంద్రం చిలప్‌చెడ్‌లో ఆయన చిలప్‌చెడ్, కౌడిపల్లి, నర్సాపూర్ ఎస్‌ఐలతో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో జరిగిన కార్డెన్ సెర్చ్‌లో భాగంగా 38 బైక్‌లు, ఒక ఆటో స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉంచామన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. కార్డెన్ సెర్చ్ విషయమై ముందుగానే తమ సిబ్బందికి పలు సూచనలు తెలియజేశామని, స్వాధీన పరుచుకున్న వాహనాలు సరైన పత్రాలు చూపించి వాహనాన్ని తీసుకెళ్లవచ్చన్నారు. అక్రమ రవాణా, నేరస్తుల ఉనికి కనిపెట్టడానికి కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తామన్నారు. అనంతరం ఆయన గ్రామస్తులకు హెల్మెట్ వినియోగం, సీసీ కెమెరాల ప్రాధాన్యత, మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మహ్మద్‌గౌస్, నర్సాపూర్ ఎస్‌ఐ శివకుమార్, కౌడిపల్లి ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



చిలప్‌చెడ్‌లో వాహనాల పత్రాలు పరిశీలిస్తున్న సీఐ షేక్‌లాల్ మధార్

నిజాంపేట(మెదక్): మండలంలోని నందిగామ గ్రామంలో రామాయంపేట సర్కిల్ పరిధిలోని పోలీసు స్టేషన్ సిబ్బందితో కలిసి సీఐ లక్ష్మీబాబు గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ మేరకు నందిగామ గ్రామంలోని ద్విచక్ర వాహనాలు, కార్లు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలకు సంబంధించిన పత్రాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 19 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిజాంపేట, రామాయంపేట ఎస్‌ఐలు శ్రీనివాస్ రెడ్డి, రంజిత్, సిబ్బంది ఉన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): దుబ్బాక నియోజకవర్గంలోని ప్రజలకు అందుబాటులో ఉండి సేవలను అందిస్తానని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రం చేగుంటలోని పలు వార్డుల్లో శనివారం ఎంపీ పర్యటించి, గ్రామ దేవతల ఆలయాలకు, 20 లక్షలతో నిర్మించే ముస్లిం ఫంక్షన్‌హాల్‌కు, ఎన్‌జీఓ కాలనీ అండర్‌డ్రైనేజీలకు శంకుస్థాపన చేశారు. పలు వార్డుల్లో పర్యటించి సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకొని, పంచాయతీ కార్మికులకు దుస్తులను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్, ఎంపీపీ మాసుల శ్రీనివాస్, జెడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంగళరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, మైనార్టీ నాయకులు అలీం, సాబేర్, నదీం, సర్పంచ్ కుమ్మరి, శ్రీనివాస్, విశ్వేశ్వర్‌రావు, జర్నల్‌సింగ్, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

గురుకుల విద్యార్థులకు కండ్ల ఇన్‌ఫెక్షన్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు వైద్యసిబ్బంది శనివారం రెండో రోజు వైద్యపరీక్షలు నిర్వహించారు. కౌడిపల్లి పీహెచ్‌సీ డాక్టర్ శ్రీకాంత్ ఆదేశాలతో సూపర్‌వైజర్లు రమేశ్, ఏఎన్‌ఎం లక్ష్మి, వైద్యసిబ్బంది విద్యార్థులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. గురుకులంలో సుమారు 150 మంది విద్యార్థుల కళ్లకు ఇన్‌ఫెక్షన్ సోకింది. దీంతో రెండు రోజులుగా వైద్యులు చికిత్సలు చేసి మందులు వేయడంతో తగ్గుముఖం పట్టిందని ప్రిన్సిపాల్ శివ ప్రసాద్, ఉపాధ్యాయులు తెలిపారు.



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామాల్లోని ప్రజలకు కళ్లకు ఇన్‌ఫెక్షన్ వ్యాప్తించింది. పీహెచ్‌సీలో ఐ డ్రాప్స్ అందుబాటులో ఉన్నాయని కంటి వైద్యుడు మోహన్‌చారి చెప్పారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

జిల్లా వ్యాప్తంగా శనివారం భక్తిశ్రద్ధలతో, కులమతాలకు అతీతంగా మొహర్రం(పీర్ల పండగ) ప్రజలు జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో భక్తులు పీర్లకు పూలు, దట్టీలు, కుడుకలు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం యువకులు, గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి, పీర్లను ఊరేగించారు. పెద్దశంకరంపేటలో జరిగిన పీర్ల పండగ వేడుకలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.



టేక్మాల్(మెదక్): మోహర్రం వేడుకల్లో అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

నర్సాపూర్: మత సామరస్యానికి ప్రతీక మొహర్రమని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. వారు శనివారం పట్టణంలో నిర్వహించిన పీర్ల ఊరేగింపులో వారు పాల్గొన్నారు. ఊరేగింపులో మున్సిపల్ వైస్ చైర్మన్ నయిమోద్దీన్, మైనారిటీ నాయకులు హబీబ్‌ఖాన్, మహ్మద్, షేక్ హుస్సేన్, రవూఫ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటతో పాటు పలు గ్రామాల్లో మొహర్రం సంబరాలు జరుపుకున్నారు. పోతాన్‌పల్లి ఊరేగింపులో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



చేగుంట(తూప్రాన్): పోతాన్‌పల్లి పీర్ల ఊరేగింపులో ఎంపీ ప్రభాకర్‌రెడ్డి



పెద్దశంకరంపేటలో మొహర్రం వేడుకల్లో నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



నర్సాపూర్ పీర్ల ఊరేగింపులో సునీతారెడ్డి, మదన్‌రెడ్డి



శివ్వంపేట(నర్సాపూర్): గోమారంలో దర్గా వద్ద పూజలు చేస్తున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

హరితహారం చెట్ల నరికివేత

శివ్వంపేట(నర్సాపూర్): పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం హరితహారంలో భాగంగా మొక్కలను నాటుతుంటే.. వాటిని నరికివేసిన సంఘటన మండలంలోని గూడూర్ గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. శివ్వంపేట నుంచి గూడూర్ గ్రామానికి వచ్చే ప్రధాన దారికి ఇరువైపుల హరితహార మొక్కలు ఏపుగా పెరిగాయి. శనివారం హరితహార చెట్లను ఇంటికి అడ్డుగా ఉన్నాయని నరికివేశారు. నరికేసిన చెట్లను సర్పంచ్ స్వరాజ్యలక్ష్మి, వార్డు సభ్యులు పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా హరితహారంలో భాగంగా పెంచిన చెట్లను తొలగించిన పెద్దకొళ్ల రాములుపై గ్రామ కార్యదర్శి ద్వారా పోలీస్‌స్టేషన్, ఎంపీడీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేయిస్తామని చెప్పారు.



నరికేసిన చెట్లను పరిశీలిస్తున్న సర్పంచ్ స్వరాజ్యలక్ష్మి

ఖరం పాలు ప్రియం

చిన్నశంకరంపేట(మెదక్): ఎన్నో వ్యాధులకు ఔషధంగా పని చేస్తున్న గాడిద పాలకు ఫుల్ డిమాండ్ ఏర్పడింది. గోవు పాలు రూ.60 లీటరు ఉండగా, ఖరము పాలు 10 గ్రాములు రూ.100 పలుకుతుంది. ఔషధ గుణాలున్న పాలకు రూ.250 వరకు విక్రయిస్తున్నారు. శనివారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలో ఓ మహిళ గాడిదతో గ్రామాల్లో పర్యటిస్తూ పాలను విక్రయిస్తోంది. గాడిద పాలతో దగ్గు, దమ్ము, ఫిట్స్, తిమ్మిర్లు, జలుబు తగ్గుతుందని చెబుతోంది.

బోజ్య తండాలో నీటి ఎద్దడి



ట్యాంకర్ల ద్వారా నీరు పట్టుకుంటున్న తండావాసులు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని బోజ్య తండాలో నీటి ఎద్దడి నెలకొంది. 5 రోజుల నుంచి తండాకు భగీరథ నీరు రావడంలేదని తండావాసులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ బోరుబావుల నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నామన్నారు. గ్రామ పంచాయతీ నుంచి ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేస్తున్నట్లు సర్పంచ్ రాజు తెలిపారు. ఈ విషయం మిషన్ భగీరథ డీఈ ప్రవీణ్ దృష్టికి తీసుకెళ్లగా.. నీటి సరఫరా చేసే పీర్లగుట్ట వద్ద విద్యుత్ సమస్య రావడంతో ఇబ్బంది వచ్చిందని, సమస్యను సరిచేశామని ఆదివారం నీరు సరఫరా అవుతుందని చెప్పారు.

దోబీ ఘాట్‌ను తొలగించొద్దు

తూప్రాన్: పట్టణంలోని ఆవుసులోని కుంట వద్ద గతంలో ఏర్పాటు చేసిన దోబీ ఘాట్‌ను మున్సిపల్ అధికారులు తొలగించేందుకు కుట్ర పన్నుతున్నారని పట్టణ రజక సంఘం నాయకులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో గజ్వేల్ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో రజకుల సంక్షేమం కోసం ప్రభుత్వ స్థలంలో దోబీ ఘాట్ మంజూరు చేసి నిర్మించారు. కాగా ప్రస్తుత మున్సిపల్ అధికారులు దోబీ ఘాట్‌ను తొలగించేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.



నిరసన వ్యక్తం చేస్తున్న రజక సంఘం నాయకులు

మున్నూరు కాపుల డిమాండ్లు నెరవేర్చండి

నర్సాపూర్ రూరల్: మున్నూరు కాపుల న్యాయమైన కోరికలను నెరవేర్చాలని కోరుతూ నర్సాపూర్ మున్నూరు కాపు సంఘం సభ్యులు సీఎం కేసీఆర్‌కు లేఖలు రాసి పంపారు. తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం నాయకుల ఆదేశాల మేరకు మున్నూరు కాపు సంఘం ప్రతీ సభ్యుడు లేఖ రాసి పంపుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు జిల్లా సంఘం నాయకులు కౌన్సిలర్ సంగసాని సురేశ్, గుండం శంకర్, బాదే బాలరాజ్, సతీశ్ యాదయ్య, వెంకటేశ్, ప్రశాంత్, గౌతం శివ, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.



లేఖలతో మున్నూరు కాపు సంఘం సభ్యులు

సంక్షిప్త వార్తలు

◆ ఆర్థిక సాయం

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి మండలం మహ్మద్ నగర్ పంచాయతీ పరిధి పెద్దమ్మగడ్డతాండాలో మృతిచెందిన బాలిక అక్షర కుటుంబాన్ని శనివారం బీఆర్ఎస్ జిల్లా నాయకులు నరెందర్‌రెడ్డి, ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు హరికృష్ణలు వేర్వేరుగా కలిసారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలు అడిగి తెలుసుకొని ఆర్థిక సాయం అందజేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, నాయకులు మల్లేశం గౌడ్, పెంట్యానాయక్, మహేందర్‌రెడ్డి, కృష్ణాగౌడ్, హనుమంతు, కృష్ణ పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలో అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న పలువురి బాధితులను జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా పరామర్శించి, చికిత్స కోసం ఆర్థికసాయం చేశారు.

◆ నియామాకం

టేక్మాల్(మెదక్): పంచాయతీ రాజ్ మినిసిరియల్ ఎంప్లాయ్స్ జిల్లా అధ్యక్షుడిగా టేక్మాల్ మండల పరిషత్‌లో జూనియర్ అసిస్టెంట్ విధులు నిర్వర్తిస్తున్న మాధవాచారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు శనివారం తెలిపారు.

◆ వైఫల్యాలను దాచేందుకే..

మెదక్ మున్సిపాలిటీ: విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు విద్యార్థి సంఘాలు, మీడియా ఎవరూ పాఠశాలలు, కళాశాలల్లోకి రానివ్వొద్దని ప్రభుత్వం చెప్పడం సరికాదని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి దినకర్ ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం తన వైఫల్యాలను దాచేందుకే ఇలాంటి ప్రకటనలు చేస్తోందని విమర్శించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

◆ టీషర్టులు అందజేత

రామాయంపేట(మెదక్): పట్టణంలోని యువజ్యోతి ఫుట్‌బాల్ అకాడమీకి చెందిన క్రీడాకారులకు శనివారం తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాగరాజు టీషర్టులు అందజేశారు. ఈ టీషర్టులను అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాల్గుణ ప్రత్యేకంగా క్రీడాకారుల కోసం పంపించారని ఆయన తెలిపారు.

◆ ఎమ్మెల్సీని కలిసిన పద్మశాలి సంఘం నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డిని కలిశారు. మండల కేంద్రంలో పద్మశాలి సంఘం భవన నిర్మాణంతో పాటు మార్కేండేయ స్వామి ఆలయ నిర్మాణానికి నిధులు అందించాలని ఎమ్మెల్సీని కోరారు. కార్యక్రమంలో మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు కిష్టయ్య, మండల నాయకులు పాల్గొన్నారు.

◆ చెరువు గండిని పూడ్చిన గ్రామస్తులు

తూప్రాన్: మండలంలోని కిష్టాపూర్ గ్రామ సమీపంలోని నర్సింల చెరువుకు గండి పడింది. ఈ విషయం గ్రామస్తులు ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్ ఆదేశాల మేరకు గ్రామస్తులు, రైతులు శుక్రవారం రాత్రి గండిని పూడ్చివేశారు.

◆ కలిసి పనిచేద్దాం

మెదక్: బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడతామని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు, హైకోర్టు న్యాయవాది తాళ్లపల్లి రాజశేఖర్ అన్నారు. నిజాంపేట జెడ్పీటీసీ పంజ విజయ్‌కుమార్‌ను శనివారం కలిసి సన్మానించారు. బీజేపీ ఆధ్వర్యంలో కలిసి పని చేద్దామని ఆహ్వానించినట్లు తెలిపారు. నిజాంపేట మండల నాయకుడు రాజిరెడ్డి ఉన్నారు.

◆ ఇళ్లు మంజూరు చేయండి

చిన్నశంకరంపేట(మెదక్): వర్షంతో ఇళ్లు కూలి ఇబ్బందులు పడుతున్న పేదలకు వెంటనే గృహ లక్ష్మి పథకం ద్వారా ఇళ్లు మంజూరు చేయాలని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. పేదలకు డబుల్‌బెడ్రూం ఇళ్లు కట్టిస్తామన్న ప్రభుత్వం విస్మరించిందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఇళ్లు కోల్పోయిన పేదలకు ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

◆ త్వరలో ఆర్థికసాయం అందజేస్తాం

రేగోడ్(మెదక్): భారీ వర్షాలకు ఇళ్లు కూలిన బాధితులకు త్వరలో ఆర్థికసాయం అందజేస్తామని తహసీల్దార్ లక్ష్మణ్ శనివారం తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఇళ్లు కూలిపోయాయని 40 మంది దరఖాస్తులు చేసుకోగా.. విచారణలో 27 ఇళ్లు కూలినట్లు ధ్రువీకరించామని చెప్పారు.

◆ బాధిత కుటుంబాలకు ఎన్ఆర్ఐ చేయూత

చేగుంట(తూప్రాన్): మండలంలోని చందాయిపేట గ్రామంకు చెందిన పిట్టల కృష్ణ పూరిగుడిసె ప్రమాదవశాత్తు దగ్ధమైన కుటుంబీకులకు ఎన్ఆర్ఐ భానుప్రసాద్ తన వంతుగా చేయూత అందించారు. గ్రామానికి చెందిన శీల నాగరాజు బంధువు భానుప్రసాద్ యూఎస్‌లో ఉంటున్నాడు. సోషల్ మీడియాలో పిట్టల కృష్ణ పూరిగుడిసె దగ్ధమైన విషయం తెలుసుకొని బాధిత కుటుంబీకులకు నిత్యావసర సరుకులు అందించేందుకు నగదు పంపించాడు. శనివారం బాధితులకు సంబంధిత వస్తువులను సర్పంచ్ స్వర్ణలతభాగ్యరాజ్, ఉపసర్పంచ్ సంతోష్, అందించారు.

◆ బోరు డ్రిల్లింగ్

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ధరిపల్లి గ్రామంలో శనివారం మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బోరు డ్రిల్లింగ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, నవీన్, రాజశేఖర్‌రెడ్డి, ఎంఎస్ఎస్ఓ ఆర్గనైజర్స్ గణేశ్, పరశురామ్‌గౌడ్ పాల్గొన్నారు.

◆ అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో ఆర్‌ఎం.సాయికిషోర్(28) సంగారెడ్డి జిల్లా కంది మండలం కాశీపూర్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఉపాధ్యాయుడి మృతిపై ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు.



సాయికిషోర్ (ఫైల్)